క్లుప్తంగా

దోమల మందు స్ప్రే



బలిజిపేటలో దోమల మందు స్ప్రే చేయిస్తున్న సర్పంచ్ రాఘులత

బలిజిపేట: బలిజిపేట పురవీధులలో సర్పంచ్ రాఘులత ఆధ్వర్యంలో దోమల మందు స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వీధులు, కాలువలు, చెత్త చెదారాలు ఉండే ప్రదేశాలలో దోమల మందు స్ప్రే చేయించడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. మురికి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదిలక్ష్మి, సీహెచ్ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదు చేయించుకోవాలి



వెంగాపురంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ శ్రావణ్, సిబ్బంది

బలిజిపేట: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. వెంగాపురంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును బుధవారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను ఆర్బీకే వద్ద వీఏఏలకు తెలియజేసి, ఆ వివరాలతో నేరుగా పంట వద్దకు వెళ్లి జియో కోఆర్డినేట్స్ ఆధారంగా పంట వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఏ రెవెన్యూ గ్రామ పరిధిలో భూమి ఉంటుందో వీఏఏలకు తెలియజేయాలన్నారు. సెప్టెంబరు 15వ తేదీ లోపల పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మోహన్, రైతులు పాల్గొన్నారు.

జీగిరాం జ్యూట్ మిల్లును తెరిపించాలి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: జీగిరాం జ్యూట్ మిల్లును తెరిపించి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు అన్నారు. ఫ్యాక్టరీ తెరవాలంటూ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో రెండవ రోజు బుధవారం చేపట్టిన దీక్షా శిబిరానికి ఆయన వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలు తరబడి ఫ్యాక్టరీ మూతబడడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిల్లు సమస్యలను జేఏసీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక తదితర సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు, మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరికి నివాళులు



పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద టంగుటూరికి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ టంగుటూరి స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచిన గొప్ప వ్యక్తని తెలిపారు. కాలేజీ చదువుల నుండి మంచి ఉన్నతమైన ఆశయాలు కలిగిన మహానుభావుడన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో కె.శివ, బి.పోలినాయుడు, ఎం.రాంబాబు, కె.చందు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

తెర్లాం: ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న తరుణంలో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని తెర్లాం ఎంపీడీఓ రామకృష్ణను బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైఇటీవల అవార్డు తీసుకున్న రామకృష్ణను జగన్నాథవలసలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఉపాధి క్షేత్ర సహాయకురాలు మాధవి జిల్లా స్థాయిలో ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడంతో అభినందించారు.

చంద్రయాన్–3 విజయం దేశానికే గర్వకారణం



బీజేపీ విజయోత్సవ ర్యాలీ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాండింగ్ చూస్తున్న విద్యార్థులు



నారాయణ స్కూల్‌లో ఇస్రోకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

చంద్రయాన్–3 విజయం దేశానికే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఇస్రో చేసిన ప్రయోగం విజయవంతం కావడంతో పలువురు ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్–3 సేఫ్ ల్యాండింగ్ కావడంతో బుధవారం పార్వతీపురం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పలు పాఠశాలల్లో విజయోత్సవాలు జరుపుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ఇంతటి ఘన విజయం సాధ్యమైందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ద్వారాపురెడ్డి శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, నారాయణ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

–పార్వతీపురం టౌన్

జగనన్న పాలనలోనే
సామాజికాభివృద్ధి



ఏగోటివలస గ్రామం

- రూ.1.95కోట్లతో రోడ్డు పనులు
- రూ.10 లక్షలతో సీసీ కాలువ పనులు



జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

సీతానగరం: మండలంలో సామాజికాభివృద్ధి పనులు జోరందుకున్నాయి. దశాబ్దాల కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న పనులు జగనన్న పాలనలో ప్రారంభమై చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలోని ఏగోటివలస గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఏగోటివలస గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు ఏగోటివలస గ్రామంలో ప్రతి ఇంటికి సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ పార్వతి తదితరులతో కలిసి వెళ్లారు. ఆ సమయంలో గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా రహదారులు, కాలువలు నిర్మించాలని కోరారు. ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం జీజీఎంపీ నిధులు రూ.10లక్షలు కాలువల నిర్మాణానికి మంజూరు చేయడంతో పనులు పూర్తి కావచ్చాయి. దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరిన ఏగోటివలస రోడ్డును రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న కేటిల్ ఫాం జంక్షన్ ఉంచి ఏగోటివలస మీదుగా గాదెలవలస వరకు బీటీ రోడ్డు పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే కృషి చేశారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.95కోట్లో పనులకు 2023 జూలై 16న భూమి పూజ చేశారు. ఆ సమయంలోనే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించడంతో రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మెటల్ పనులు పూర్తయ్యాయి.

రహదారి కష్టాలు తీరాయి...



గ్రామం నుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారం. జగనన్న పాలనలో బీటీ రోడ్డు నిర్మాణం కావడంతో మా గ్రామస్తుల కష్టాలు తీరాయి. సమస్య పరిష్కరించిన జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటాం.

– యడ్ల గంగులు, రైతు, ఏగోటివలస

మేలు మరచిపోలేం..



మా గ్రామ పంచాయతీలో ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలు మరచిపోలేం. దశాబ్దాలుగా రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో అవస్థలు పడ్డాం. ముఖ్యంగా విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు. ఎమ్మెల్యే జోగారావు కృషితో పది గ్రామాల ప్రజలకు అవసరమైన రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జగనన్న ప్రభుత్వానికి అండగా ఉంటాం.

– రాధాకృష్ణ, సర్పంచ్, ఏగోటివలస



గ్రామంలో కాలువలు

సీఎం పర్యటనకు తరలిరండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యమంత్రి సమావేశానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కళ్లేపల్లి త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ ప్రమీల

పాచిపెంట : సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలంలో శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సభను పార్టీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంపీపీ బి ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలానికి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మండలం ముఖ్య నాయకులతో మాట్లాడి పాచిపెంట మండలానికి 31 బస్సులు కేటాయించడం జరిగిందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి సభకు ప్రజలు తరలి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

సక్రమంగా పంటకోత ప్రయోగాలు



శిక్షణ ఇస్తున్న ఏఎస్ఓ విజయరావు

బలిజిపేట: పంటకోత ప్రయోగాలను సక్రమంగా నిర్వహించాలని ఏఎస్ఓ విజయరావు తెలిపారు. బలిజిపేట ఆర్బీకేలో వీఏఏలకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్సురెన్స్ క్లయిమ్ పంటకోత ప్రయోగాల ఆధారంగానే ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. 5 సంవత్సరాల ముందు ఉన్న సాధారణ దిగుబడి ప్రాతిపదికన పంట దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తారని, జిల్లాలో అధికంగా పండిస్తున్న పంటను బట్టి పంటకోత ప్రయోగాలు ఏ పంటకు చేయాలి అని నిర్ణయించబడుతుందని తెలిపారు. ఒక గ్రామం యూనిట్‌గా వరికి బీమా అమలు చేస్తున్నామని, ప్రతి 100హెక్టార్లను ఒక యూనిట్‌గా తీసుకుని పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని తెలిపారు. సర్వే నంబరు, సబ్ డివిజన్ ద్వారా నైరుతి మూల దిశగా, వ్యతిరేక సవ్య దిశలో ప్లాట్ గుర్తించాలని, పంటకోత ప్రయోగాలను నిర్దేశించిన యాప్‌లో రేండమ్‌గా ఎంపిక చేసి రైతుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా టీకాలు వేయాలి : డీఐఓ



గాదెలవలస అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డీఐఓ

సీతానగరం: చిన్నారులు, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. గాదెలవలస పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన గడువులోగా ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది వేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల వలన ఉపయోగాలు, సకాలంలో టీకాలు వేయడం వలన ఇతర వ్యాధులు దరి చేరవన్నారు. పిల్లల తల్లులకు ఆరోగ్యపరమైన వివరాలపై అవగాహన కల్పించుకుని ప్రజలకు తెలియజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారాన్ని సకాలంలో బాలింతలకు, ప్రీ స్కూలు పిల్లలకు, గర్భిణులకు పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సోషల్ ఆడిట్



సుబద్రలో మాట్లాడుతున్న ఎంఈజీ సామల

బలిజిపేట: సోషల్ ఆడిట్‌ను ఎంతో పకడ్బందీగా జరపాలని ఉపాధి హామీ పథకం సుబద్ర గ్రామ పరిశీలకుడు, ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. సుబద్రలో సోషల్ ఆడిట్ గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకునిగా హాజరైన ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడు తూ ఉపాధి హామీ పథకానికి హాజరైన ప్రతీ ఒక్కరి ని సంప్రదించి వారు చెప్పిన వివరాలను నమోదు చేసుకుని మీకు వచ్చే రిపోర్టు ఆదారంగా అక్కడ పనులు సక్రమంగా జరిగాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. పనులు నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరిగినా వాటిని ఉన్నతాధికారుల దృష్టి లో ఉంచాలన్నారు. సోషల్ ఆడిట్ వలన రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు వచ్చే అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింహాచలంనాయుడు, సోషల్ ఆటిట్ బృంధం పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు

రామభద్రపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పెన్షన్ మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రమామణి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో పెన్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను బుధవారం పరిశీలించారు. మండలంలో 450 మందికి పైగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి అర్హులకు పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఎంఈఓ తిరుమలప్రసాద్ పాల్గొన్నారు.

వంద రోజులు పని చేస్తే.. ఉద్యోగ అవకాశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: ఉపాధి హామీ పనుల్లో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలో నిరుద్యోగులుంటే ఆ కుటుంబంలో ఒకరికి శిక్షణ ఇచ్చి ప్రైవేటు పరంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను, జేఈ కృష్ణ, వెలుగు రీజనల్ జాబ్స్ రిసోర్సుపర్సన్ ఈశ్వరమ్మ, ఉపాధి క్షేత్ర సహాయకులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో వంద దినాలు పూర్తి చేసుకున్న వేతనదారు కుటుంబంలో పదో తరగతి చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి ఉద్యోగ భృతి కల్పించనున్నట్టు తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు జిల్లా మహిళా ప్రాంగణంలో కంప్యూటర్, వృత్తి విద్య పరమైన ఉద్యోగాలు పొందడానికి 90 రోజులు శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల వారు తమ పేర్లను క్షేత్ర సహాయకుల ద్వారా అందజేయాలని కోరారు. వేతనదారులు ప్రజలకు ఉపయోగపడే మొక్కలను ప్లాంటేషన్ చేయాలని, ఔషధ మొక్కలు నాటాలని కోరారు. టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటి డోర్ నంబర్‌లో ఓటర్లు సరిపోవాలి : ఆర్డీఓ



ఇంటింటి ఓటరుసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం: ఒక ఇంటి డోర్ నంబర్‌లో ఉన్న ఓటర్ల వివరాలు ఓటరు జాబితాలో సరిపోవాలని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. పార్వతీపురం మండలం కొత్తవలస, గిజన కాలనీ, నవిరి ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు పునశ్చరణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఇంటింటి ఓటర్ల విచారణ పక్కాగా జరగాలన్నారు. ఇంటి డోర్ నంబర్‌లోఉన్న ఓటర్ల వివరాలు ఓటరు జాబితాతో సరిపోవడం లేదని, ఒకే ఇంటిలో 10మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు చూపిస్తుందని రాజకీయ పార్టీల సమావేశంలో ఆ పార్టీ నాయకుల ఆరోపణ మేరకు ఆమె స్వయంగా తనిఖీలు నిర్వహించారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 29 వరకు ఓటరు కార్డుపై ఫొటో మిస్‌మ్యాచింగ్, క్లారటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు వంటి అంశాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. సమగ్ర ముసాయిదా జాబితా సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 16 వరకు జరుగుతుందన్నారు. ముసాయిదా జాబితా అక్టోబర్ 27న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 17 నుండి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించవచ్చునన్నారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 20 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 2023 అక్టోబర్ 1 నాటికి, 2024 జనవరి 1 నాటికి అర్హత గల ఓటర్లు ఓటు హక్కును నమోదు చేయడం జరుగుతుందన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓలు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలో రామా కాలనీ వద్ద ప్రజలతో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ప్రకాష్, యశోదకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సూచించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన ఆమె గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల ప్రభుత్వ భవన నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంజినీరింగ్, టూరిజం పనులు సకాలంలో పూర్తి కావాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, పీఆర్ ఈఈ రాధారాణి, డీఈ లోకనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోని డ్రాపౌట్స్‌పై ప్రవీణ్ ప్రకాష్ ఆరా



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు

వీరఘట్టం: పాఠశాలల్లోని డ్రాపౌట్స్‌పై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆరాతీశారు. బుధవారం వీరఘట్టం ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావులకు వాట్సాప్ కాల్ చేసి, మాట్లాడిన ఆయన మండలంలో 575 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు రాష్ట్ర విద్యాశాఖ వచ్చిన సమాచారంపై ఆరాతీశారు. అయితే వారిలో 335 మంది వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నట్లు గుర్తించినట్లు ఎంఈవోలు పేర్కొన్నారు. మరో 22 మంది టెన్త్, ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన వారిగా, 8 మందికి వివాహాలు జరిగినట్లు, 41 మంది వలస వెళ్లినట్లు, ఆరుగురు చనిపోయినట్లు గుర్తించామన్నారు. 34 మంది డ్రాపౌట్స్‌గా గుర్తించామని, 13 మంది వివరాలు తెలియరాలేదన్నారు. మొత్తం 470 మంది వివరాలు సేకరించామని, ఇంకా 105 మంది వివరాలు సేకరిస్తున్నామని ఎంఈవోలు తెలిపారు.